సాక్షి చిత్తూరు

గురువారం । 3 । జూలై । 2025



తోతా'పూర్'

జిల్లాలో తోతాపురి రకం కొనేవారు లేక మామిడిపై ఆశలు వదులుకొని చెట్లను నరికివేస్తున్నారు. - 8లో



మదపుటేనుగుల కట్టడి..

కుంకీల శిక్షణ 6 నెలల పాటు సాగనుంది. అంత వరకు పంట పొలాలపైకి వస్తున్న ఏనుగుల మాటేమిటి? - 8లో



అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను నగరి పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఆర్అండ్‌బీలో బదిలీలు

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలోని ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే (ఎన్‌హెచ్) పరిధిలో పలువురిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్అండ్‌బీ జిల్లా ఎస్ఈగా సురేష్‌బాబును నియమించారు. కర్నూలులో ఈఈగా ఉన్న ఆయనను జిల్లా ఇన్‌చార్జి ఎస్ఈగా నియమించారు. చిత్తూరు ఎన్‌హెచ్ డీఈ కృష్ణయ్యను అనంతపురం ఎన్‌హెచ్ సర్కిల్ ఇంచార్జి ఈఈగా బదిలీ చేశారు. సబ్ డివిజన్ డీఈగా ఉన్న సత్యమూర్తిని టెక్కలి ఇన్‌చార్జి ఆర్అండ్‌బీ ఈఈగా బదిలీ చేశారు. ఏఈగా ఉన్న సుజాతను ఉద్యోగోన్నతిపై చిత్తూరు ఎన్‌హెచ్ డీఈగా నియమించారు.

విద్యుత్ గ్రీవెన్స్‌లను వెంటనే పరిష్కరించాలి



సమస్యలను తెలుసుకుంటున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్ : సకాలంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. బుధవారం చిత్తూరు అర్బన్ డివిజన్ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలో పలు సమస్యలను వినియోగదారులు తెలియజేశారు. బిల్లు రివిజన్ సమస్యను కొత్తపల్లె నుంచి, వాణిజ్య సర్వీసు నుంచి గృహ సర్వీసుకు మార్పు చేయాలని ఓబనపల్లె నుంచి, విద్యుత్ సర్వీసుకు ఉన్న మొబైల్ నంబర్‌ను మార్పు చేయాలని మురకంబట్టుకు చెందిన వినియోగదారుడు ఫిర్యాదులు చేశారు. వీటిని అప్పటికప్పుడు మార్పు చేసినట్లు ఈఈ తెలిపారు. కార్యక్రమంలో డీఈ ప్రసాద్, టెక్నికల్ ఏఈ మాధురి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం



రామకృష్ణ



బాలాజీ

చిత్తూరు అర్బన్ : చిత్తూరులోని రెండు న్యాయస్థానాలకు ఇద్దరు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తూ రాష్ట్ర హోంశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరులోని ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ న్యాయస్థానానికి వీఆర్.రామకృష్ణ, 6వ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయస్థానానికి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎం.బాలాజీని నియమించింది. మూడేళ్ల పాటు వీరు ఈ పదవిలో కొనసాగనున్నారు.

ముగిసిన డీఎస్సీ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో గత నెల 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు బుధవారంతో ముగిశాయ్. చిత్తూరు డీఈఓ వరలక్ష్మి, తిరుపతి డీఈఓ కేవీఎన్ కుమార్ పరీక్షలను పకడ్బందీగా పర్యవేక్షించారు. చిత్తూరు జిల్లాలోని 8 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలకు మొత్తం 33,181 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 30,952 మంది హాజరయ్యారు. మిగిలిన 2,229 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. అదేవిధంగా తిరుపతి జిల్లాలోని 8 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలకు మొత్తం 21,340 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 19,550 మంది హాజరయ్యారు. మిగిలిన 1,790 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

రీకాల్ చంద్రబాబు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఇన్‌చార్జి కృపాలక్ష్మి



బాబు మోసాలను ఎండగడదాం

- హామీల అమలులో కూటమి విఫలం
- రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో
- క్యూఆర్ కోడ్ పోస్టర్ల ఆవిష్కరణ
- వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన

కార్వేటినగరం : ఎన్నికల ముందు చంద్రబాబు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉమ్మడి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గం స్థాయిలో 49 కొత్తపల్లిమిట్టలో దీపికా కళ్యాణ మండపంలో రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో, బాబూ ష్యూరిటీ...మోసం గ్యారంటీపై వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామితో పాటు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కరుణాకరరెడ్డి మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల ముందు 18 ఏళ్ల నుంచి 50 సంవత్సరాల మహిళలందరికీ ప్రతి నెలా రూ.1,500 చొప్పున ఇస్తామన్న బాబు అధికారంలోకి వచ్చాక మోహం చాటేశారన్నారు. పింఛను పథకాన్ని గొప్పగా చెప్పుకుంటున్న బాబు.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన వాటి కంటే ఒక్క కొత్త పింఛను అయినా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు కార్యక్రమం చేపట్టాక కిందకి దిగొచ్చి అరకొరగా తల్లికి వందనం పథకం అమలు చేశారన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 87 లక్షల మంది విద్యార్థులకు రూ. 13,500 కోట్లు అవసరముంటే కేవలం రూ. 8,000 కోట్లు విడుదల చేశారని దుయ్యబట్టారు. అధికారంలోకి వస్తే ఇన్ని డబ్బులొస్తాయని ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులు బాండ్లు పంచారని, హామీలు అమలు చేయకపోతే కాలర్ పట్టుకొని అడగాలని చంద్రబాబు కుమారుడు లోకేష్ చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు గ్రామాల్లోకి వెళ్తే అన్ని వర్గాల వారు కూటమి ప్రజా ప్రతినిధుల కాలర్ పట్టుకోవడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రజలందరికీ గుర్తు చేయడానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ప్రకటించారు.

2019–24 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. 5 ఏళ్ల పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని పదేళ్ల ముందుకు తీసుకెళితే చంద్రబాబు ప్రస్తుత ఏడాది పాలనలో రాష్ట్రాన్ని 15 ఏళ్ల వెనక్కి నెట్టేశారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మణి, వెంకటరామిరెడ్డి, శేఖర్‌రాజు, విజయకుమార్, పద్మనాభరెడ్డి, తులసియాదవ్, ఎంపీపీ హేమలతారెడ్డి, జడ్పీటీసీలు సుకుమార్, అన్బుఅళగన్, సర్పంచ్ డిల్లెయ్య, ఎంపీటీసీ కోటిరెడ్డిబాబు, నాయకులు హేమసుందర్‌రెడ్డి, విజయబాబు, ధనంజయవర్మ, చందురాజు, కుప్పయ్య, జనార్దన్, యశోదారెడ్డి, నారాయణరెడ్డి, దూది మోహన్, హరిబాబు, రాజశేఖర్‌రెడ్డి, శ్యామ్ పలువురు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకరరెడ్డి

కలిసి పనిచేద్దాం



నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు అందరూ కలసి కట్టుగా పని చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుని మరోసారి విప్లవాత్మక పథకాల ద్వారా మహిళలకు అండగా నిలుద్దామని ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి అన్నారు. గ్రామాల్లో ప్రజలు టీడీపీని తరిమే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వంపై పోరాటం చేసే సమయం ఆసన్నమైందని, ప్రజలకు తోడుగా వైఎస్సార్‌సీపీ నాయకులు అండగా నిలుస్తారని పిలుపు నిచ్చారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కష్ట సుఖాల్లో తోడుగా అండగా ఉంటామని, కేసులకు భయపడొద్దని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. చంద్రబాబు సంపద సృష్టిస్తానని చెప్పి, ఎమ్మెల్యేలు గుట్టలు, కొండలని తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారని, అదేనా సంపద సృష్టించడం అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీ సామాజిక వర్గంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.1500 చొప్పున ఇస్తానన్న బాబు ఒక్క పైసా కూడా ఇవ్వకపోవడం దారుణమని దుయ్యబట్టారు, నవరత్నాలు పథకం ద్వారా జగనన్న సంక్షేమ పథకలూ అందిస్తే చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలను దారుణంగా మోసం చేశారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ జెండా ఎత్తిన ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు.

మహిళలకు రక్షణ కరువు



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్ సీపీ జేడీ నెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి రోజు రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, బాలికల మిస్సింగ్ కేసులు నమోదు అవుతున్నా మహిళా పక్షపాతి అని చెప్పుకునే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాత్రం నోరు మెదపడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బాలికలు కూటమి నాయకుల చేతిలో అత్యాచారాలకు గురవుతున్నప్పటికీ హోం మంత్రిగా ఒక మహిళా ఉంటూ స్పందించకపోవడం దారుణంగా ఉందన్నారు.

నేడు ప్రైవేట్ పాఠశాలలు బంద్

చిత్తూరు కలెక్టరేట్ : విద్యాహక్కు చట్టం 12(1) సీ ప్రకారం అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లకు ఉచిత అడ్మిషన్లు ఇవ్వాలన్న నిబంధన అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు పరిష్కరించాలని అపుస్మా నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరించాలంటూ జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 408 ప్రైవేట్, కార్పొరేట్ బడులకు గురువారం బంద్‌కు పిలుపునిచ్చారు. డిమాండ్లు పరిష్కరించాలంటూ అపుస్మా (ఏపీ ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల సంఘం) ఉద్యమబాట పట్టింది. ఇందులో భాగంగానే ఈ గురువారం జిల్లా మొత్తం స్వచ్ఛందంగా పాఠశాలలను మూసివేసి, స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్, డీఈవోలకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఆర్టీఈ ఉచిత అడ్మిషన్ల అమలులో ఎదురవుతున్న సమస్యలు, ఆర్థికపరమైన బకాయిల చెల్లింపులు నిలిపివేత, తదితర సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

టీచర్ల దురుసు ప్రవర్తనపై చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో మే 29వ తేదీన టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియలో టీచర్ల దురుసు ప్రవర్తనపై అధికారులు చర్యలు తీసుకున్నారు. తిరుపతి జిల్లాలోని రామచంద్రాపురం మండలం జెడ్పీ అనుపల్లి హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న పీడీ సురేష్, చిత్తూరు జిల్లాలోని గంగాధర నెల్లూరు మండలం పీబీ అగ్రహారానికి చెందిన ఎస్జీటీ విజయకుమార్ డీఈవోపై దురుసుగా ప్రవర్తిస్తూ సంభాషించారు. ఆ విషయం ఉన్నతాధికారుల వరకు వెళ్లింది. దీంతో సంబంధిత పీడీ, ఎస్జీటీ టీచర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసి వారి నుంచి లిఖిత పూర్వకంగా సమాధానం సేకరించారు. వారిచ్చిన సమాధానం పై సంతృప్తి చెందకపోవడంతో పీడీ సురేష్‌ను సస్పెండ్ చేస్తూ తిరుపతి డీఈవో ఉత్తర్వులు జారీచేశారు. అలాగే ఎస్జీటీ విజయకుమార్‌పై శాఖాపరమైన చార్జెస్ నమోదు చేస్తున్నట్లు చిత్తూరు డీఈవో వరలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

రసాభాసగా తడుకు ప్రజాభిప్రాయ సేకరణ

పుత్తూరు : మండల పరిధిలోని తడుకు సచివాలయం వద్ద బుధవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కోసం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా ముగిసింది. సర్పంచ్ వెంకటేశు అధ్యక్షతన సభ నిర్వహించారు. పొల్యూషన్ ఈఈ రాజశేఖర్ మాట్లాడుతూ.. తడుకు రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వే నెంబర్ 182/పి లోని 6 హెక్టార్లు అర్.మధుసూదన్‌రావు రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్ వారికి, సర్వే నంబర్ 507/2 లోని 2.520 హెక్టార్లు శ్రీకనకదుర్గ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్ తవ్వకాలకు ఇ–వేలం ద్వారా బిల్డర్లుగా ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ఇందుకు గాను లీజు జారీ చేయడానికి గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇక్కడి స్థితిగతులు, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా తడుకు పంచాయతీ ఎంపీటీసీ సుబ్బరత్నమ్మ భర్త గంగాధరం మాట్లాడడానికి ప్రయత్నించగా క్వారీ సిబ్బంది అడ్డుకున్నారు. బలవంతంగా సచివాలయం గదిలోకి తీసుకెళ్లి తాము పరిష్కరిస్తామంటూ గంటకు పైగా నిర్బంధించారు. అనంతరం పట్టుబట్టి బయటకు వచ్చిన గంగాధరం ఆర్డీఓ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేసి, క్వారీలకు అనుమతి ఇవ్వరాదంటూ కోరారు. అలాగే గుంతకల్లు, తాడిపత్రి నుంచి వచ్చిన పర్యావరణ వేత్తల బృందాన్ని సైతం మాట్లాడడానికి సాక్ష్యాత్తు పొల్యూషన్ ఈఈ రాజశేఖర్ అనుమతించలేదని గ్రామస్తులు ఆరోపించారు. పర్యావరణవేత్తల బృందానికి, క్వారీ యజమానుల సిబ్బంది మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. ఈ గందరగోళం మధ్యనే సభను ముగించారు. కార్యక్రమంలో పొల్యూషన్ ఏడీ మధన్‌మోహన్‌రెడ్డి, ఏఈ శశికళ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఆర్డీఓ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న గంగాధరం

కీరమంద యూపీ స్కూల్ అప్‌గ్రేడ్

బంగారుపాళెం : మండలంలోని కీరమంద యూపీ స్కూల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యిందని ఎంఈఓ నాగేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గత నెల పాఠశాల పునఃప్రారంభం నుంచే హైస్కూల్‌గా మార్పు చేసి తరగతులు బోధించాలంటూ కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందాయని పేర్కొన్నారు. కీరమందలో 1961లో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయగా అటు తరువాత 2002లో ప్రాథమికోన్నత పాఠశాల, 2025లో ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యిందని తెలిపారు.

విద్యార్థులకు ఊరట

ప్రాథమికోన్నత విద్య తరువాత 9, 10 తరగతులు చదివేందుకు కొదలమడుగు, కీరమంద గ్రామ పంచాయతీల పరిధిలోని విద్యార్థులు సుమారు 8 కిలో మీటర్ల దూరంలోని ఎగువ రాగిమానుపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గానీ, లేదా టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి వచ్చేది. బస్సు సౌకర్యాలు లేకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తూ అష్టకష్టాలు పడేవారు. ప్రస్తుతం కీరమందలోనే యూపీ స్కూల్ అప్‌గ్రేడ్ కావడంతో విద్యార్థులకు కష్టాలు తప్పాయి.



ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయిన కీరమంద యూపీ స్కూల్

- కార్డుల జారీలో తీవ్ర జాప్యం
- కౌలు రైతుల కష్టాలు
- జిల్లా వ్యాప్తంగా లక్ష్యం 4,200సీసీఆర్ కార్డులు
- జారీ చేసినవి 594 కార్డులు
- రైతు సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వ తీరుపై కౌలు రైతుల ఆగ్రహం

జిల్లా సమాచారం

జిల్లాలోని పంచాయతీలు :	697
జిల్లాలోని గ్రామాలు :	822
2024లో ఇచ్చిన సీసీఆర్ కార్డులు :	4200
2025లో నిర్దేశించిన సీసీఆర్ కార్డులు :	4200
ఇప్పటి వరకు ఇచ్చిన కార్డులు :	594



పొలం పనుల్లో కౌలు రైతు

సీసీఆర్‌ఛీ

నగరి : వ్యవసాయరంగ అభివృద్ధి, రైతు సంక్షేమం విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పంట సాగు రైతులకు అందించే సీసీఆర్ (పంట సాగు హక్కుపత్రం) కార్డుల జారీ నత్తనడకన సాగుతుండటమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. కౌలు రైతులకు ఈ కార్డులతో ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం గతేడాది ఈ పథకాన్ని అటకెక్కించింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకూ ఈ పథకం ఊసేలేదు. ఇక పంటల సాగు చేపట్టే రైతులకు ఇచ్చే సీసీఆర్ కార్డుల జారీలోనూ జాప్యం నెలకొనడంతో కౌలు రైతులు మండిపడుతున్నారు.

సీసీఆర్ కార్డుతో ప్రయోజనాలు

కౌలు రైతులకు ఈ గుర్తింపు కార్డులు ఉంటేనే బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం లభిస్తుంది. ఇతర వ్యవసాయ సంక్షేమ పథకాల జారీకి ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంటుండటంతో కౌలు రైతులంతా సీసీఆర్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇక వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు సీసీఆర్ కార్డు తప్పనిసరి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సీసీఆర్ కార్డుల జారీ మాత్రం జిల్లాలో సజావుగా సాగకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది.

బ్యాంకు రుణాలు అందక

జిల్లా వ్యాప్తంగా గతేడాది 4200 సీసీఆర్ కార్డులు జారీ చేయగా, ఈ ఏడాది కూడా 4200 కార్డులు జారీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. అయితే ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు కేవలం 594 కార్డులు మాత్రమే జారీ చేశారు. అంటే రెండున్నర నెలల్లో నిర్దేశించిన లక్ష్యంలో కేవలం 14 శాతం మాత్రమే సీసీఆర్ కార్డులు జారీ చేయడం గమనార్హం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గుర్తించిన మేరకు కౌలు రైతులు అందరికీ ఈ సీసీఆర్ కార్డులు జారీ చేయగా ఈ ఏడాది కూటమి ప్రభుత్వంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో బ్యాంకు రుణాల ఊసే లేదు. దీంతో ఖరీఫ్ పెట్టుబడుల కోసం కౌలు రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే పరిస్థితి నెలకొంది.

గుర్తింపు కార్డులు ఇవ్వాలి



ప్రభుత్వం కౌలు రైతుల ను గుర్తించి వెంటనే అందరికీ సీసీఆర్ గుర్తింపు కార్డులు ఇవ్వాలి. లేని పక్షంలో గతేడాది ఇచ్చిన కార్డులను రెన్యువల్ చేయాలి. వ్యవసాయమే ఆధారంగా బతికే కౌలు రైతులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– రమేష్, కౌలురైతు, నింద్ర

మామిడి సాగులో నష్టపోయాం



మామిడి తోటలు కౌలుకు సాగుచేశాం. కాపు కోతకు వచ్చే దశలో గిట్టుబాటు ధర లేదు. ఫ్యాక్టరీల వద్ద టోకెన్లకు తిరిగి తిరిగి కాళ్లరిగిపోతున్నాయి. దీంతో తోటల్లోనే కాయలు అలాగే వదిలేస్తున్నాం. ఇంకా 50 ట్రాక్టర్ల కాయలున్నాయి. టోకెన్లు త్వరగా ఇప్పిస్తే లాభాలు రాకపోయినా నష్టాలైనా తగ్గించుకుంటాం. బ్యాంకులో రుణాలు పొందడానికి సీసీఆర్ కార్డులు కూడా లేవు.

– ధనంజయ రెడ్డి, కౌలు రైతు, కలికిరింఢ్ల, కార్వేటినగరం మండలం

లక్ష్యాన్ని త్వరలో పూర్తి చేస్తాం



కౌలు రైతులు సీసీఆర్ కార్డుల కోసం అభ్యర్థనలు చేశారు. కౌలు రైతుల విషయంలో దీనికి ఎంతో ప్రాధాన్యం ఉంది. గత ఏడాది అందరికీ కార్డులు అందించాం. ఈ ఏడాది కొందరికి అందజేశాం. త్వరలో ప్రభుత్వం లక్ష్యం మేరకు కౌలుదారులను రైతు సేవా కేంద్రాల ద్వారా గుర్తించి వారికి సాగు హక్కు పత్రాలైన సీసీఆర్ కార్డులు అందజేస్తాం.

– రాఘవేంద్ర యాదవ్, వ్యవసాయ అధికారి, నగరి మండలం

నేడు కృత్రిమ పరికరాల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ కళాశాల ప్రాంగణంలో గురువారం ఉదయం 11 గంటలకు 977 మంది విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ పరికరాల పంపిణీ చేయనున్నట్లు బుధవారం డీఆర్వో మోహన్‌కుమార్ విలేకరులకు తెలిపారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రాందాస్ అథాలే, జిల్లా ఇంచార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు.

ఉద్యోగ మేళాలో 67 మంది ఎంపిక



అభ్యర్థినికి నియామకపత్రం ఇస్తున్న చైర్మన్ శ్రీధర్

చిత్తూరు కలెక్టరేట్: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తమ కళాశాలలో నిత్యం ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన సుధ డిగ్రీ కళాశాల చైర్మన్ శ్రీధర్ అన్నారు. బుధవారం నగరంలోని సీఎంటీ రోడ్డులోని ఆ కళాశాలలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఎంపికలకు పేరొందిన కంపెనీలు పాల్గొన్నాయన్నారు. మేళాలో 105 మంది పాల్గొనగా అందులో 67 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులను అందజేశారు. పలు కంపెనీల ప్రతినిధులు, అధ్యాపకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

5న సచివాలయ ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల పరిధిలో విధులు నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఈనెల 5వ తేదీన బదిలీల ఉత్తర్వులు పంపనున్నారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు కసరత్తు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడుతుందని భావించి 5వ తేదీన ఉత్తర్వులు జారీ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. నేరుగా ఈ మెయిల్ ద్వారా బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు పంపనున్నారు. వివిధ ప్రాంతాలకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు బదిలీ అయినప్పటికీ పాత స్థానాల్లోనే కొనసాగిస్తున్నారు. బదిలీ ఉత్తర్వులు జారీచేసిన తర్వాత కొత్త స్థానాల్లో విధుల్లో చేరాలని అధికారులు సూచిస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం


సుబ్రమణ్యం

చౌడేపల్లె : పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం కాటిపేరిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కాటిపేరికు చెందిన సుబ్రమణ్యం(45) కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్థాపం చెంది పురుగుమందు తాగి అపస్మారకస్థితిలో వెళ్లగా కుటుంబ సభ్యులు గుర్తించి 108 సహాయంతో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పుంగనూరు(చౌడేపల్లె) : పట్టణంలోని అంబేడ్కర్ భవనం సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు బుధవారం స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం తెలపడంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతుడి వివరాలపై ఆరా తీశారు. మృతుడు బిక్షాటన చేసుకుంటూ అంబేడ్కర్ సర్కిల్ వద్ద తలదాచుకునేవాడని తెలిపారు. మృతదేహాన్ని పుంగనూరు ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పుంగనూరు పోలీసులను సంప్రదించాలని సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

విచారణ నివేదిక.. తప్పుల తడక

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : తన కుమార్తె శ్రీదుర్గ మృతి విషయంలో విచారణ కమిటీ ఇచ్చిన నివేదిక తప్పుల తడకగా ఉందని బీసీ నాయకులు షణ్ముగం ఆరోపించారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తన కుమార్తె శ్రీదుర్గ రోడ్డు ప్రమాదానికి గురై జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తే.. సరైన చికిత్స అందక మృతి చెందిందని తెలిపారు. ఇందులో వైద్యుల నిర్లక్ష్యం ఉందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించానని ఆయన పేర్కొన్నారు.

తోతా‘పూర్’


తుమ్మిందలో మామిడి చెట్లను జేసీబీతో తొలగిస్తున్న రైతు

మామిడి.. కష్టాలు..కన్నీళ్లు

- మార్కెట్‌లో అమ్ముడుపోని తోతాపురి కాయలు
- రైతులకు చేదును మిగుల్చుతున్న వైనం
- ఫలరాజుపై ఆశలు వదులుకుంటున్న రైతులు
- మామిడి చెట్ల నరికివేతలు.. ప్రత్యామ్నాయం వైపు చూపులు

కాణిపాకం : ప్రస్తుతం జిల్లాలో మామిడి రైతులు కుదేలవుతున్నారు. ధరాఘాతంతో డీలా పడిపోయారు. తోతాపురి రకంను కొనేవారు లేక విలవిలలాడిపోతున్నారు. టేబుల్ రకాలు సైతం మామిడి రైతులకు నష్టాలను తెచ్చిపెడుతున్నాయి. ఈసారి మామిడి ఫలం రైతుకు చేదును మిగిల్చాయి. తద్వారా మామిడిపై రైతులు ఆశలు వదులుకుంటున్నారు.

మార్కెటింగ్ శాఖ అధికారుల వివరాల మేరకు గత ఐదేళ్లుగా మామిడి ధరల వివరాలు.(రూ.కేజీలల్లో)

సంవత్సరం	బేనీషా	పులేరా	తోతాపురి	కాలేపాడు	నీలం	కాదర్
2019-20	35	9-12	17-20	24	21	20-40
2020-21	45	17-25	22-25	35	33	22-35
2021 -22	16 -35	12-20	12-55	35-40	12	57-60
2022-23	35-40	12-15	24-75	30-35	25	27-30

గత ఐదేళ్లల్లో సిరులు

గత ఐదేళ్ల కాలంలో మామిడి రైతులకు సిరులు కురిపించింది. టేబుల్ రకాలు...జేబులు నింపాయి. ఈరకం కేజీ రూ. 20 నుంచి సెంచరీ(రూ.100) కొట్టాయి. అదే తోతాపురి రూ. 10 నుంచి రూ.75వరకు పలికింది. దీంతో పండిన కాయలను రైతులు కోత కోసి చిత్తూరు, బంగారుపాళ్యం, దామలచెరువు మార్కెట్, ఫ్యాక్టరీలకు విక్రయించుకునేవారు. రోజుల తరబడి క్యూలో వేచి ఉండే పరిస్థితిలు ఉండేవి కావు. కాయలు అన్‌లోడింగ్ అయినా వెంటనే అప్పటికప్పుడే చేతికి డబ్బులు ముట్టేవి. ముఖ్యంగా టేబుల్ రకాలను చాలా మంది రైతులు బెంగుళూరు, చెన్నై వంటి ప్రాంతాలకు నేరుగా విక్రయించుకునేవారు. వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని తద్వారా వచ్చే ఆర్డర్లకు అనుగుణంగా కొనుగోలు దారులకు కాయలను పంపేవారు. ఇలాంటి బుకింగ్‌ల ద్వారా రైతులు అధిక లాభాలను గడించేవారు. అలాగే తోతాపురి కాయలు మంచి లాభాలను గడించి పెట్టాయి. ఐదేళ్ల కాలం పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మామిడి రైతులను కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చింది.

ఈసారి మామిడి ధర వివరాలు

మామిడి రకం	ధరలు (రూ.లల్లో)
తోతాపురి	2-8
బేనీషా	9-15
కాదర్	15-30
పులేరా	4-15
కాలేపాడు	15-25
నీలం	10-15

ప్రత్యామ్నాయం కోసం చెట్లు నరికేస్తూ..

మామిడి ఆశించిన మేర ప్రతిఫలం ఇవ్వకపోవడంతో పాటు అమ్మకపు పోరు పడలేక రైతులు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారు. ప్రధానంగా తోతాపురి పంటను నేలమట్టం చేస్తున్నారు. చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో మామిడి చెట్లను జేసీబీలతో తొలగిస్తున్నారు. అలాగే తవణంపల్లి మండలంలోని మామిడి చెట్లను ఇది వరకే నరికివేశారు. యాదమరి మండలం దాసరపల్లి గ్రామంలో ఓ రైతు తోతాపురి చెట్లను తలొగించి టేబుల్ రకం కాయలను అంటుకట్టేందుకు ముందడుగు వేశారు. మరింత మంది రైతులు కూడా మామిడి చెట్లను నరికివేసేందుకు సమాయత్తమయ్యారు. కొబ్బరి చెట్లు పెట్టాలనే యోచనలో ఉన్నారు.

నేడు కుదేలు

ఈ ఏడాది మామిడి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. దిగుబడిని చూసి...సంబర పడిపోయినా రైతులను ధరలు తీవ్రంగా నిరాశపరిచాయి. దీంతో వారి ఆశలు అడియాశలయ్యాయి. టేబుల్ రకాలు ప్రతి ఫలం ఇవ్వకపోగా..తోతాపురి చేదును నింపింది. రైతులు తోతాపురికాయల అమ్మకానికి అష్ట కష్టాలు పడుతున్నారు. టోకెన్ పద్ధతితో తికమకపడిపోతున్నారు. ఫ్యాక్టరీలు కాయలు తీసుకొచ్చాక మద్దతు ధర మాయమైంది. ఫ్యాక్టరీలు కేజీ తోతాపురి రూ.8 పాట పాడి...తర్వాత రూ.6, రూ.5. రూ.4 అంటూ..చివరకు నోరెత్తకుండా చేసింది. ర్యాంపుల్లో రూ.2కే అమ్ముడుబోతుంది. అది కూడా క్యూ పద్ధతిలో కాయలు అమ్ముకుంటున్నారు. ఐదురోజులు అయినా అన్‌లోడింగ్ కానీ పరిస్థితి దాపురించింది. ప్రస్తుతం ధరలపై ఫ్యాక్టరీలు స్పష్టత ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అమలు విషయంలో నోరెత్తకపోవడంతో రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు.

కష్టాలు.. నష్టాలే మిగిలాయి..



మామిడి తోటను ఏళ్ల తరబడి కంటికి రెప్పలా కాపాడాం. కొన్నేళ్లుగా మంచి ఫలితం ఉండేది. లాభాలొచ్చాయి. తోతాపురి కేజీ రూ.75వరకు అమ్ముకున్నాం. ఈసారి కష్టాలు..నష్టాలు అనుభవించాం. చాలు ఈ పంట అని వదిలించుకుంటున్నాం. అందుకే ఎకరాలో మామిడి తోటలో పంటను తొలగించాం. ప్రత్యామ్నాయంగా పంట వేయాలని అనుకుంటున్నాం.

– కుమార్, తుమ్మింద, చిత్తూరు మండలం

పెట్టుబడి రాలేదు..



ఏటా పెట్టుబడి వేలల్లో పెట్టి అలసిపోతున్నాం. ఈసారి పెట్టుబడి చూస్తే రూ.60 వేలు దాటింది. దిగుబడి బాగనే వచ్చిన..పెట్టుబడికి తగట్టు ఆదాయం ఉండాలి. అప్పుడే రైతు కోలుకుంటాడు. ఆ రకంగా రైతుకు ఫలితం లేదు. తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం నష్టాలను గుర్తించాలి. రైతును ఆదుకోవాలి. లేకుంటే ప్రత్యామ్నాయం తప్ప వేరేమార్గం లేదు.

– కొత్తూరు బాబు నాయుడు, రైతు నాయకుడు, చిత్తూరు మండలం

- చిత్తూరు మండలం తుమ్మింద గ్రామానికి చెందిన కుమార్ అనే రైతుకు 2.50 ఎకరాల మామిడితోట ఉంది. ఏటా ఈ తోట ద్వారా 20 టన్నుల దాకా కాయలొచ్చేవి. గతంలో టన్ను రూ.15 నుంచి రూ.75 వరకు అమ్ముకున్న సీజన్ కూడా ఉంది. అయితే ఈసారి తోతాపురిని కొనేవారు లేక రైతు తీవ్ర ఇబ్బందులు పడ్డాడు. చేసేదీ లేక ర్యాంపులో తోతాపురి కిలోల లెక్కన్న రూ.2.50కు అడిగారు. పట్టుబట్టి రూ.3కు విక్రయించాడు. దీంతో రైతు మామిడిపై ఆశలు వదులుకుని బుధవారం మామిడి చెట్లను తొలగింపునకు పూనుకున్నాడు. ముందుగా ఎకరా చెట్లను జేసీబీలతో తొలగించాడు.


జేసీబీతో మామిడి చెట్టును తొలగిస్తున్న దృశ్యం

- తవణంపల్లి మండలంలోని దిగువ మాధవరంలో రైతు రామకృష్ణారెడ్డి చెట్లను నరికివేశారు. అదే విధంగా సరకల్లులో రైతు రమేష్‌కు ఏడెకరాల మామిడి తోట ఉంది. ఈ ఏడాది ఆశాజనకంగా మామిడి దిగుబడి వచ్చింది. కాయల ఫ్యాక్టరీలకు తరలించడానికి ఫ్యాక్టరీల చుట్టూ టోకెన్లు కోసం తిరిగి విసిగిపోయాడు. దీంతో చెట్లను నరికివేయడానికి నిర్ణయం తీసుకున్నాడు. తన తండ్రి పెట్టిన చెట్లను 40 ఏళ్లుగా కాపాడినా పంటను అమ్ముకోలేని దుస్థితికి రావడంతో చెట్లను తొలగించి ప్రత్యామ్నాయ పంట సాగు చేయాలని చెట్లను తొలగించేస్తున్నాడు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

– తాళం వేసిన ఇళ్లే టార్గెట్


స్వాధీనం చేసుకున్న నగదు, ఫోన్లు

నగరి : తాళం వేసి ఉన్న ఇల్లు, ఆఫీసుల్లో చొరబడి చోరీకి పాల్పడే అంతర్రాష్ట్ర దొంగ ధరన్‌సాయి (35)ను నగరి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ విక్రమ కథనం మేరకు గత నెల 8వ తేదీన కొండచుట్టు మండపం ఏరియాలో లాయర్ లోకేష్ ఆఫీసులో అర్ధరాత్రి, గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి లక్ష రూపాయల నగదు, రెండు మొబైల్ ఫోన్లు చోరీ చేశారు. ఈ విషయమై లోకేష్ ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు ప్రారంభించారు. అందిన సమాచారం మేరకు ఓంశక్తి గుడి వద్ద నిఘా పెట్టిన పోలీసులు అనుమానాస్పదంగా సంచరిస్తున్న ధరన్‌సాయిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడన్నారు. అతడి వద్ద నుంచి చోరీ చేసిన నగదులో రూ. 75 వేల రూపాయలు, రూ. 40 వేల రూపాయల విలువ చేసే రెండు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. అతడిపై గతంలో తిరుత్తణిలో చోరీ కేసు ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన ఎస్‌ఐ విజయ నాయక్, సిబ్బంది లోకనాథం, గోపి, సత్య, గజేంద్ర, అశోక్, రమేష్‌ను అభినందించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

శ్రీరంగరాజపురం : మండలంలోని 49 కొత్తపల్లి మిట్ట దీపిక కళ్యాణ మండపంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గ స్థాయిలో రీకాలింగ్ చంద్రబాబు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఇన్‌చార్జి కృపాలక్ష్మి ఆధ్వర్యంలో టీడీపీ నుంచి మండలానికి చెందిన దివాకర్, శ్రీను, మదన్‌కుమార్, వెదురుకుప్పం మండలం నుంచి ధనరాజ్ వైఎస్సార్‌సీపీలోకి చేరారు.

ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ.. ఏడాదికే కూటమి పాలన అరాచకం, దౌర్జన్యం తట్టుకోలేక టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి రావడం శుభ పరిణామమన్నారు. రానున్న రోజుల్లో మరింత చేరికలు ఉంటాయన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, మండల కన్వీనర్ మణి, మాజీ కన్వీనర్ అనంత రెడ్డి, జిల్లా క్రియాశీలక కార్యదర్శి విజయబాబు, కుప్పయ్య, సర్పంచ్ డిల్లయ్య, ఎంపీటీసీ సభ్యులు కోటిరెడ్డిబాబు, నాయకులు పాల్గొన్నారు.


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఇన్‌చార్జి కృపాలక్ష్మి

క్యాంపునకు ఏడు కుంకీ ఏనుగులు

- వీటిలో రెండు యాక్టివ్‌గా లేనివి
- పూర్తి స్థాయి శిక్షణకే ఆరు నెలలు దాకా పట్టే అవకాశం

మదపుటేనుగుల కట్టడి ఇప్పట్లో లేనట్టే!

పలమనేరు: జిల్లాలోని కౌండిన్య అభయారణ్యంలో ఏనుగుల సమస్య దశాబ్దాలుగా ఉంది. కూటమి ప్రభుత్వం కుంకీ ఏనుగుల ద్వారా ఇక్కడి ఏనుగులను కట్టడి చేసేందుకు పలమనేరు మండలంలోని మొసలిమడుగు వద్ద కుంకీ ఎలిఫెంట్ ప్రాజెక్టు పనులను చేపడుతోంది. ప్రస్తుతానికి వీటికి మేతపెట్టి అవసరమైన శిక్షణతోపాటు కౌండిన్య అడవి లో తిప్పుతున్నారు. ఈ శిక్షణ మరో ఆరు నెలలు దాకా జరిగి ఆపై కౌండిన్యలోని మదపుటేనుగులను లొంగదీసుకునే పనులు జరగనున్నాయి. అప్పటి దాకా అడవిలోంచి పంటలపైకి వస్తున్న ఏనుగుల మాటేమిటని బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు.

క్యాంపులో ఏడు ఏనుగులు

కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన నాలుగు కుంకీలతోపాటు రామకుప్పం మండలంలోని ననియాల క్యాంపు నుంచి రెండు, తిరుపతి జూ నుంచి ఓ ఏనుగును ఇక్కడికి తరలించారు. వీటిలో ఒక్కటి గుడ్డి, మరొకటి కాలు దెబ్బతిని వృద్ధాప్యంలో ఉన్నాయి. వీటికి ట్రైనర్స్ ఆరు నెలలపాటు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది.


మొసలిమడుగు ఎలిఫెంట్ క్యాంపులో శిక్షణపొందుతున్న ఏనుగులు

కౌండిన్యలో ఏనుగుల పరిస్థితి ఇదీ

పలమనేరు, కుప్పం పరిధిల్లోని కౌండిన్య అభయారణ్యంలో 120 దాకా ఏనుగులు ఉన్నాయి. తమిళనాడులోని మోర్ధన ఫారెస్ట్ నుంచి, ననియాల, కర్ణాటకలోని బన్నేరుగట్ట, బంగారుపేట, కేజీఎఫ్, తమిళనాడులోని క్రిష్ణగిరి, హొసూరు, కావేరిపట్నం తదితర ప్రాంతాల నుంచి కౌండిన్యలోకి తరచూ ఏనుగులు వస్తున్నాయి. గత పదేళ్లలో 16 ఏనుగులు చనిపోయాయి. ఏనుగుల కారణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14 మంది మృతి చెందగా 26 మందిదాకా గాయపడ్డారు.

మదపుటేనుగులను కట్టడికి ఏర్పాట్లు

మండలంలోని మొసలిమడుగు వద్ద రూ.12 లక్షలతో కుంకీ ఎలిఫెంట్ క్యాంపును 50 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. ఏనుగుల కోసం కర్రల కంచెతో విడిది, చిన్నపాటి చెరువు, శిక్షణా స్థలం, క్రాల్స్ (మదపుటేనుగుల ను మచ్చిక చేసుకొనే చెక్కగది)ని ఏర్పాటు చేశారు. రోజూ వీటికి మేత పెట్టి అడవిలోకి పంపుతున్నారు.

సంరక్షణ భారమే

సాధారణంగా ఓ ఏనుగుకు రోజుకి 900 లీటర్ల నీరు, 10 హెక్టార్లలో ఫీడింగ్ అవరముంది. మరోవైపు వంద ముద్దల రాగి సంగటి, బెల్లంతో కలిపిన వరిధాన్యం, వరి గడ్డి ఉండలను పొద్దున పెట్టాలి. నెలకు ఓ ఏనుగుకు రూ.లక్ష ఇలా ఏడు ఏనుగులకు ఏడు లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

మదపుటేనుగుల కట్టడి ఎలాగంటే!

క్యాంపులోని ఏనుగులను అడవిలోకి తరలించి నాలుగు దిక్కుల్లో నాలుగు ఏనుగులను పెట్టి మధ్య లోని బలమైన కుంకీ ద్వారా మదనపుటేనుగు సమీపంలోకి వెళ్లాలి. కుంకీపై ఉన్న మావటి మత్తుసూదిని మదపుటేనుగుకు వేసి అది స్పృహకోల్పోయాక దాన్ని అక్కడున్న ఏనుగులు ముసలిమొడుగు క్యాంపుకు తరలిస్తారు. ఆపై కుంకీ ద్వారా ఏనుగుకు శిక్షణనిచ్చి దాన్ని క్యాంపులోనే కుంకీలా మార్చేస్తారు.


పలమనేరు కౌండిన్య అభయారణ్యంలో ఏనుగుల గుంపు(ఫైల్‌ఫోటో)


మదపుటేనుగులకు బంధించి శిక్షణనిచ్చే క్రోల్స్

కుంకీలతో ఏనుగుల కట్టడి సాధ్యమే



పలమనేరులో కుంకీ ఎలిఫెంట్ క్యాంపులోని ఏనుగులకు శిక్షణ సాగుతోంది. ఆపై వీటిని అడవిలోకి తీసుకెళ్లి మదపుటేనుగులను బంధించి వాటికి క్యాంపులో శిక్షణ ఇవ్వాలి. ఇదంతా త్వరగా జరిగే పనులు కావు. కానీ కొన్నాళ్ల తర్వాత కుంకీల ద్వారా మదపుటేనుగులను పట్టుకోవడంతో ఈ సమస్యకు పరిష్కారం దొరకుతుంది.

– భరణి, డీఎఫ్‌వో, చిత్తూరు

కోడె దూడల ఉత్పత్తి


విత్తనపు కోడె దూడను వీర్యకేంద్రానికి తరలిస్తున్న డీడీ డాక్టర్ వాసు, సిబ్బంది

తవణంపల్లె : జిల్లాలో అత్యధిక జన్యు సామర్థ్యం కలిగిన విత్తనపు కోడె దూడలను ఉత్పత్తి చేస్తున్నట్లు జిల్లా పశు సంతతి పరిశీలన కేంద్రం డీడీ డాక్టర్ వాసు తెలిపారు. బుధవారం తవణంపల్లె, గుడిపాల, పెనుమూరు మండలాల్లోని అత్యధిక జన్యు సామర్థ్యం కలిగిన 10 కోడె దూడలను సేకరించి నకరేకల్ వీర్య కేంద్రానికి పంపినట్లు తెలిపారు. పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి మరింత చేయూత ఇస్తున్నట్లు వివరించారు. పాల దిగుబడి పెంచే లక్ష్యంగా ఆరోగ్యకరమైన, దృఢమైన సంకర జాతి పశుసంపదను ఉత్పత్తి చేయడంలో జిల్లా పశు సంతతి పరిశీలన కేంద్రం ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్లు వివరించారు. డీడీతో పాటు వెటర్నరీ డాక్టర్ రామయోగానందారెడ్డి, డాక్టర్ మౌనిక, సూపర్‌వైజర్ శివకుమార్ పాల్గొన్నారు.

సర్వ దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో శ్రీవారి సర్వ దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో నాలుగు కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 76,126 మంది స్వామివారిని దర్శించుకోగా 24,720 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి భక్తులు హుండీలో రూ.3.97 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.